## క్లుప్తంగా

### డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించాలి

ప్రొద్దుటూరు : ప్రభుత్వం వెంటనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించాలని డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మేరికుమార్, విశ్వనాథ్ డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం డిప్యూటీ తహసీల్దార్ సాయినాథ్‌రెడ్డికి వారు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు మెగా డీఎస్సీపై ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. డీఎస్సీ నిర్వహించకుండా కాలయాపన చేయడం నిరుద్యోగులకు అన్యాయం చేయడమేనన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు సుబ్బారావు పాల్గొన్నారు.

### డీఎస్పీని కలిసిన ఎన్‌సీసీ బృందం

ప్రొద్దుటూరు : స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలోని శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ బృందం నూతనంగా బాధ్యతలు తీసుకున్న డీఎస్పీ పి.భావనను బుధవారం గౌరవప్రదంగా కలిశారు. కళాశాల కోఆర్డినేటర్ గౌరీశంకర్ ఎన్‌సీసీ బృందం తరపు ఉడ్‌తో తయారు చేసిన జాతీయ పతాకాన్ని డీఎస్పీకి అందించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ డిగ్రీ చదువుతున్న విద్యార్థులు ఎన్‌సీసీలో ఉండటం ద్వారా బీ, సీ సర్టిఫికెట్లు మీ ఉద్యోగ భవిష్యత్తులో మంచి ప్రయారిటీ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ ఇన్‌స్ట్రక్టర్ దావీదు పాల్గొన్నారు.

### మాజీ ఎమ్మెల్యేను కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు

చాపాడు : మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డిని బుధవారం ప్రొద్దుటూరులోని ఆయన గృహంలో చాపాడు మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు కలిశారు. ఇటీవల వైఎస్సార్‌సీపీ నియోజక వర్గాల వారీగా వివిధ రకాలైన పదవులు కార్యకర్తలకు అప్పగించారు. ఈ క్రమంలో నియోజకవర్గ క్రిస్టియన్ వింగ్ అధ్యక్షుడిగా నియమితులైన కేతవరం గ్రామానికి చెందిన గొడుగు బాబ్జీ, ఎంపీపీ తెలిదేల లక్షుమయ్య, మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి, గొడుగు జయరాజుతో కలిసి మాజీ ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.

### సూపర్ సిక్స్ హామీల అమలు సాధ్యమే..

ఖాజీపేట : ఎన్నికల ముందు 40 సంవత్సరాల రాజకీయ అనుభవం అంటూ అధికారంలోకి వచ్చిన చంద్రబాబు సూపర్ సిక్స్ హామీలు అమలు చేయడం సాధ్యం కాదంటూ చెప్పడం తగదని కడప ఆర్టీసీ జోనల్ మాజీ అధ్యక్షుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి విమర్శించారు. మండలంలోని దుంపలగట్టులో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు సూపర్‌సిక్స్ పథకాల అమలు సాధ్యం కాదని మీకు తెలియదా బాబు అంటూ మండిపడ్డారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నీ అమలుచేసిన ఏకైక సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు.. కరోనా లాంటి క్లిష్టమైన పరిస్థితులు వచ్చినా రైతుభరోసా, అమ్మఒడి, పంటనష్ట పరిహారం ఇచ్చిన గొప్ప వ్యక్తి జగన్ అన్నారు. ప్రజలను మోసం చేసిన చంద్రబాబుకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు.

### చలికోట్లు పంపిణీ

పోరుమామిళ్ల : స్థానిక కస్తూర్బాగాంధీ పాఠశాల విద్యార్థినులకు బుధవారం ఎఫ్‌సీఎస్ సహకారంతో చిత్తా శౌరిరెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చలికోట్లు అందజేసింది. ట్రస్టు వ్యవస్థాపకులు డాక్టర్ గీత, తోమాస్‌రెడ్డి దంపతులు 274 మంది బాలికలకు సంస్థ ప్రతినిధులు ప్రసాద్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డిల ద్వారా చలికోట్లు అందించారు.

### జగనన్న కాలనీలో గృహాల పరిశీలన

చాపాడు : మండలంలోని పల్లవోలులోని జగనన్న కాలనీలో నూతన గృహాలను హౌసింగ్ డీఈ రమేష్‌బాబు బుధవారం పరిశీలించారు. ఫిబ్రవరి 1న రాష్ట్ర వ్యాప్తంగా నూతన గృహాలను ప్రారంభించనున్న నేపథ్యంలో పల్లవోలులో నిర్మాణాలను పూర్తి చేసుకున్న ఇళ్లను పరిశీలించినట్లు డీఈ తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ ప్రమోద్, మండల ఇన్‌ఛార్జి ఏఈ సాయికేశవ పాల్గొన్నారు.

### అగస్త్యేశ్వరుడికి భస్మార్చన

ప్రొద్దుటూరు కల్చరల్ : అమవాస్య సందర్భంగా స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున అగస్త్యేశ్వరుడికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి కుంకుమార్చన చేసి ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం ప్రదోష కాలంలో అగస్త్యేశ్వరస్వామికి పంచామృతాభిషేకం, సుగంధ పూజా ద్రవ్యాలు, భస్మంతో అభిషేకించారు. అనంతరం స్వామికి హారతి ఇచ్చి భక్తిశ్రద్ధలతో పూజించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఈఓ రామచంద్రాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

### ఆర్ఎంపీ వైద్యుడు ఆత్మహత్య

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని రామేశ్వరంలో బోధనం రమేష్ (30) అనే ఆర్ఎంపీ వైద్యుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఈశ్వరరెడ్డి నగర్‌కు చెందిన రమేష్ వసంతపేటలో క్లినిక్‌ను ఏర్పాటు చేసుకొని ఆర్ఎంపీ వైద్యుడిగా కొనసాగుతున్నాడు. అతనికి పెళ్లి కాలేదు. అతను మూడు నెలల నుంచి తెలియని అనారోగ్య సమస్యతో బాధపడుతున్నాడు. నిద్ర సరిగా రాకపోవవంతో రాత్రి వేళల్లో మాత్రలు మింగేవాడు. ఈ క్రమంలో అతని సోదరుడు ఓబయ్య బుధవారం మధ్యాహ్నం క్లినిక్ వద్దకు వెళ్లగా రమేష్ ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. వెంటనే అతన్ని ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యుడు తెలిపాడు. తన సోదరుడు రమేష్ అనారోగ్యంతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఓబయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# సస్యరక్షణతో అధిక దిగుబడులు




కుమ్మరోనిపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న వ్యవసాయాధికారి



బేతాయపల్లెలో పత్తిపంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

బి.కోడూరు : మండలంలోని తుమ్మలపల్లె రైతు సేవా కేంద్రం పరిధిలోని కుమ్మరోనిపల్లె గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారిణి కౌశిక పెసర, వరిపంట పొలాలను పరిశీలించి విత్తనశుద్ధి, ఎరువుల వాడకం, సస్యరక్షణ చర్యలు గురించి రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఆఖరు దుక్కిలో రైతులు ఖచ్చితంగా పొటాష్ ఎరువులను వాడాలని సూచించారు. వరిలో కాండంతొలుచు పురుగును గుర్తించి నివారణ చర్యలు తెలిపారు. అదేవిధంగా రబీలో రైతులు సాగు చేసిన ప్రతి పైరును ఇ-పంట నమోదు, ఈకేవైసీ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది బ్రహ్మానందరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

**బేతాయపల్లెలో పొలం పిలుస్తోంది**

గోపవరం : మండలంలోని బేతాయపల్లె రైతుసేవా కేంద్రం పరిధిలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ, స్థానిక వ్యవసాయ సిబ్బంది పాల్గొని ముందుగా గ్రామ సభ ఏర్పాటు చేసి రైతులకు వివిధ పంటలలో యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. ఏరువాక కేంద్రం ఊటుకూరు సమన్వయకర్త డాక్టర్ అంకయ్యకుమార్ పాల్గొని రైతులకు ప్రకృతి వ్యవసాయంపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రస్తుతం పత్తి, నూగులు, వరి, క్రాసింగ్ సజ్జలను రైతులు సాగు చేశారు. ఆ పంటలను పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సస్యరక్షణ చర్యల గురించి తెలియజేశారు. మందుల వినియోగం, జీవన ఎరువులు, విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు పాటించాలన్నారు. డ్రోన్ టెక్నాలజీ వంటి అధునాతన పద్ధతులపై కూడా గ్రామసభలో చర్చించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి విజయకుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పశువైద్య కళాశాల విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులతో పశువైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసప్రసాద్

ప్రొద్దుటూరు : స్థానిక పశువైద్య కళాశాల విద్యార్థులు ఇటీవల తిరుపతి పశువైద్య విశ్వవిద్యాలయంలో నిర్వహించిన 13వ అంతర్ కళాశాల, రాష్ట్రస్థాయి క్రీడలు, సాంస్కృతిక, సాహిత్య పోటీల్లో ప్రతిభ చూపారని కళాశాల అసోసియేట్ డీన్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసప్రసాద్ తెలిపారు. బుధవారం పశువైద్య కళాశాలలో ఆయన మాట్లాడుతూ మహిళల క్రీడల విభాగంలో బీవీఎస్సీ 4వ సంవత్సరం విద్యార్థిని ఎం.సాయితేజస్వి వ్యక్తిగత ఛాంపియన్ షిప్‌ను వరుసగా రెండో సారి కైవసం చేసుకుందన్నారు. బాలికల విభాగంలో వాలీబాల్ పోటీలో విజేతగా నిలిచినట్లు తెలిపారు. బాస్కెట్ బాల్, షటిల్ బ్యాడ్మింటన్, చెస్, బాల్ బ్యాడ్మింటన్‌లో ద్వితీయ స్థానంలో, బాలుర విభాగంలో క్రికెట్, షెటిల్, బ్యాడ్మింటన్, క్యారమ్స్‌లో ద్వితీయ స్థానంలో నిలిచారని పేర్కొన్నారు. సాంస్కృతిక విభాగంలో 27 అంశాల్లో 24 అంశాలను తమ కళాశాల విద్యార్థులు గెలుపొందారన్నారు. నృత్య ప్రదర్శనలతో ప్రేక్షకులను ప్రత్యేకంగా ఆకర్షించి ప్రథమ స్థానంలో నిలిచారని చెప్పారు. ఈ విభాగంలో బీవీఎస్సీ ఫస్ట్ ఇయర్ విద్యార్థిని కీర్తన నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందన్నారు. గ్రూప్, జానపద నృత్య ప్రదర్శనలు అందరి మన్ననలు పొందాయన్నారు. సాహిత్య విభాగంలో 9 అంశాలలో 6 అంశాలను గెలుచుకున్నారు. క్విజ్‌లో రెండో స్థానంలో నిలిచారన్నారు. పోటీల్లో పాల్గొన్న 105 మంది విద్యార్థులను ప్రిన్సిపాల్ అభినందించారు. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించిన అధ్యాపకులు హరిప్రియ, సీఎస్ఏ డాక్టర్ కళ్యాణి, సాంస్కృతిక విభాగం డాక్టర్ డి.ఇందిర, సాహిత్య విభాగం డాక్టర్ చరిత, డాక్టర్ రాజకిశోర్, డాక్టర్ కళ్యాణ చక్రవర్తిలకు ప్రిన్సిపాల్ అభినందనలు తెలిపారు.

## కార్మికులను ఆదుకోవాలి

ప్రొద్దుటూరు : రిక్షా, హమాలీలు, వలస కార్మికులను (అడ్డా కూలీలు) రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని మహాజన రాష్ట్ర సమితి రాష్ట్ర అధ్యక్షుడు యామవరం చంద్రశేఖర్ తెలిపారు. స్థానిక ఎన్‌జీఓ హోంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిక్షా, హమాలీలు, వలస కార్మికులు దుర్భర జీవితాన్ని అనుభవిస్తున్నారని తెలిపారు. ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం వీరిని ఆదుకోలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వీరికి నెలకు రూ.10వేలు ఆర్థిక భృతిగా అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎర్రన్న, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు బాలలక్షుమయ్య, ఏపీ దళిత సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లె యల్లయ్య, సుబ్బరాయుడు, సుదర్శన్, బాలకుమార్, బీఎస్పీ నాయకులు జయరాముడు, ఎమ్మార్పీఎస్ నాయకుడు సుధాకర్, రిక్షా కార్మికులు, వలస కార్మికులు పాల్గొన్నారు.

## అన్నదానం



అన్న ప్రసాదం వడ్డిస్తున్న శ్రీనివాసుల స్వామి తదితరులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక కొర్రపాడురోడ్డులోని మున్సిపల్ పెట్రోల్ బంకు సమీపంలో బుధవారం చొళంగి అమావాస్య సందర్భంగా కాలభైరవ స్వామి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 300 మందిపైగా భక్తులకు అన్నప్రసాద వినియోగం జరిగింది. ముందుగా కాలభైరవస్వామి చిత్రపటానికి, విగ్రహానికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసి పూలతో అలంకరించారు. కాలభైరవస్వామి ఉపాసకులు శ్రీనివాసుల స్వామి ఆధ్వర్యంలో 300 మంది పైగా భక్తులకు అన్న ప్రసాదాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాలభైరవస్వామి చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు చంద్రశేఖర్, పెద్దమల్లిఖార్జున, చరణ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు ఇచ్చిన హామీలపై స్పష్టత ఇవ్వండి



మాట్లాడుతున్న భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి

ప్రొద్దుటూరు : ఎన్నికలకు ముందు కూటమి నాయకులు ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై స్పష్టత ఇవ్వాలని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్ భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలతోపాటు ఉద్యోగులకు, వ్యాపారులకు మేలు చేస్తామని హామీలు ఇచ్చారన్నారు. సీఎం చంద్రబాబు ఇటీవల పత్రికా సమావేశంలో మాట్లాడిన తీరు చూస్తే అసలు ఇచ్చిన సంక్షేమ పథకాలు అమలు చేస్తారో లేదో అని ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వల్లే ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోయిందని, తాను అమలు చేస్తానన్న హామీలను అమలు చేయలేకపోతున్నానని మొసలి కన్నీరు కారుస్తున్న వైనం బాధాకరమన్నారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి నియోజకవర్గంలో అసాంఘిక కార్యక్రమాలను పూర్తిగా నిర్మూలిస్తామని హామీ ఇచ్చారన్నారు. కానీ అమలులో విఫలమయ్యారన్నారు. టీడీపీ నాయకులే అసాంఘిక కార్యకలాపాలను పెంచి పోషించే విధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.600 కోట్ల ప్రభుత్వ నిధుల ద్వారా అభివృద్ధి పనులు చేపడితే అందులో రూ.300 కోట్ల పనులను రద్దు చేశారన్నారు. మిగిలిన పనులు కూడా సజావుగా జరగడం లేదన్నారు.

## స్మార్ట్ మీటర్లను అడ్డుకోండి



అట్లూరులో అమర్చిన స్మార్ట్ మీటర్‌ను చూపుతున్న సీపీఎం మండల కార్యదర్శి రమణయ్య

అట్లూరు : విద్యుత్ స్మార్ట్ మీటర్లు అమర్చేది పేరుకే ఉచితమని మరో 90 నెలల వరకూ బిల్లు వసూలు చేస్తారని ఈ మీటర్లను అమర్చకుండా అడ్డుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి రమణయ్య తెలిపారు. అట్లూరులో బుధవారం గృహాలకు విద్యుత్ స్మార్ట మీటర్లు అమర్చుతుంటే అడ్డుకున్నామన్నారు. ఈ స్మార్ట్ మీటర్లు అమర్చితే ఇకపై సెల్ ఫోన్‌కు రీచార్జి చేసినట్లుగానే ముందుగా రీచార్జి చేసుకోవాలన్నారు. రీచార్జి అయిపోగానే విద్యుత్ సరఫరా ఆగిపోతుందన్నారు. దీంతో వినియోగదారులకు అగచాట్లు తప్పవన్నారు. అర్ధరాత్రి సరఫరా ఆగిపోతే చీకట్లో ఉండాల్సిందే అన్నారు. అలాగే స్మార్ట్ మీటర్లు అమర్చితే సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ధ్వంసం చేస్తామని హెచ్చరించారు.

## నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునేందుకు దోహదం



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు నియామకపత్రాలు అందజేస్తున్న నిర్వాహకులు

బద్వేలు అర్బన్ : జాబ్‌మేళా ద్వారా విద్యార్థులు తమలోని నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునేందుకు వీలుపడుతుందని రాచపూడి నాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాల పరిపాలనాధికారి ఆర్.వెంకటసాయి కృష్ణ తెలిపారు. బుధవారం స్థానిక రాచపూడి నాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాలలో ఫస్ట్‌సోర్స్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఒకవైపు చదువుకుంటూనే ఉద్యోగాలు సాధించేందుకు ఇటువంటి జాబ్‌మేళాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ జాబ్‌మేళాలో 27 మంది నిరుద్యోగ యువతీ యువకులను ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక చేసి ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ, కంపెనీ ప్రతినిధులు సుమిత్‌కుమార్, అశోక్, కబీర్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 5న చలో విజయవాడ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మైదుకూరు : ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై ఫిబ్రవరి 5న చలో విజయవాడ నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి మిద్దె వెంకటరమణ తెలిపారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద చలో విజయవాడ కరపత్రాలను బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజర్వేషన్ల సాధన కోసం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సంయుక్త జాతీయ సమావేశం విజయవాడలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో మాదిగలంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు తప్పెట శివ, రాష్ట్ర అధికార ప్రతినిధి తప్పెట హరిబాబు, జిల్లా కన్వీనర్ సంజీవ్, జిల్లా కార్యదర్శి వెంకటసుబ్బయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు రామయ్య, దువ్వూరు మండల నాయకులు రవి, గోపి, ఓబులేసు, సుధాకర్ పాల్గొన్నారు.

## పరిహారం సమస్యపై ఉన్నతాధికారులకు నివేదిక



బాధిత రైతులతో మాట్లాడుతున్న రెవెన్యూ, నేషనల్ హైవే అధికారులు

చాపాడు : గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణ పనుల్లో భూ పరిహారం అందని రైతుల సమస్యలపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని తహసీల్దారు రమాకుమారి పేర్కొన్నారు. మండలంలోని తిప్పిరెడ్డిపల్లె వద్ద జరుగుతున్న గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే నిర్మాణ పనులను బుధవారం భూ పరిహారం అందని బాధిత రైతులు అడ్డుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న నేషనల్ హైవే జిల్లా అధికారి సాయిరెడ్డి, తహసీల్దారు రమాకుమారి రైతుల వద్దకు వెళ్లి చర్చించారు. తమకు పరిహారం అందే వరకూ పనులు అడ్డుకుంటామని, తమకు న్యాయం చేయాలని అధికారులను బాధిత రైతులు కోరారు. దీనికి స్పందించిన అధికారులు భూ పరిహారం అందని బాధిత రైతుల వివరాలను సేకరించి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. ఉన్నతాధికారులు బాధిత రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటారని తెలిపారు.

## మాజీ ఎమ్మెల్యే పరామర్శ



సూరారెడ్డి కుటుంబీకులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే

ఖాజీపేట : రావులపల్లె వైఎస్సార్ సీపీ నాయకుడు సూరారెడ్డి(73) కొద్దిరోజుల క్రిందట అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి బుధవారం రావులపల్లెలోని మృతుడి స్వగృహానికి వెళ్లి అతడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి రాఘవరెడ్డి, కడప ఆర్టీసీ రీజనల్ జోన్ మాజీ అధ్యక్షుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, కేసీ కెనాల్ ప్రాజెక్టు కమిటీ మాజీ అధ్యక్షుడు డీఎల్.శ్రీనివాసులరెడ్డి, కేసీ కెనాల్ ప్రాజక్టు కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి, మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి, కూనవారిపల్లె సర్పంచ్ సుబ్బారెడ్డి, దుంపలగట్టు నాయకుడు రామకృష్ణారెడ్డి, చల్లా నాగేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ గాలిపోతు మనోహర్, మద్దిక నాగేశ్వర్‌రెడ్డి ఓబుల్‌రెడ్డి, ఇటుకల నారాయణరెడ్డి, సుబ్బరామిరెడ్డి పాల్గొన్నారు.

## సంపద సృష్టించి, సంక్షేమం అమలు చేసేదెప్పుడు?



మాట్లాడుతున్న గోవిందరెడ్డి

పోరుమామిళ్ల : నీతి అయోగ్ నివేదికపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలుకు ఇంకా సంపద సృషించాల్సి ఉందని, 15 శాతం వడ్డీ రేటు పెరిగితే తప్ప పథకాలు అమలు చేయలేమని చెప్పడంతో ప్రజల్లో ప్రశ్న ఉత్పన్నమవుతున్నదని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎప్పుడు సంపద సృష్టిస్తారు? సంక్షేమం అమలు చేసేదెప్పుడని టాయన ప్రశ్నించారు. విజనరీ, ఆర్థిక సంస్కరణల్లో దిట్ట, 40 ఏండ్ల రాజకీయ అనుభవం అంటూ చంద్రబాబు గురించి గొప్పలు చెప్పిన నాయకులు ఎటువంటి అవగాహన లేకుండానే మోసపూరిత హామీలు ఇచ్చారన్నారు. హామీల అమలుకు అన్ని వర్గాల ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. సూపర్‌సిక్స్ అమలుకు రూ. 1,50,718 కోట్లు అవసరమన్నారు. డిప్యూటీ సీఎం కూటమి హామీల అమలు విషయంలో ఎందుకు నోరెత్తడంలేదన్నారు. పవన్‌కు బాధ్యత ఉందో లేదో ప్రజలకు చెప్పాలన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన మేనిఫెస్టోను భగవద్గీత, బైబిల్, ఖురాన్‌లా భావించారని, కోవిడ్ వంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా ప్రజలకు సంక్షేమపథకాలు ఆపలేదన్నారు. కూటమి నాయకులు మేనిఫెస్టో అమలుపై సన్నాయి నొక్కులు నొక్కుతున్నారన్నారు. ఇది ఏరు దాటాక బోడి మల్లన్న సామెత గుర్తుకు తెస్తున్నదన్నారు. అనతి కాలంలోనే అన్ని వర్గాల ప్రజలు తాము ఏమి కోల్పోయారో తెలుసుకుంటున్నారని గోవిందరెడ్డి అన్నారు. దగా పడ్డ ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ ఉంటుందని ఆయన తెలిపారు.

## నాఫెడ్ స్థలంలో కాపు భవనమా..!

మైదుకూరు : కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ నాఫెడ్‌కు కేటాయిస్తూ జీఓ ఇచ్చిన భూమిలో కాపు భవనం నిర్మించేందుకు పరిశీలించడం శోచనీయమని బీజేపీ మాజీ జాతీయ కార్యవర్గ సభ్యుడు బీపీ.ప్రతాపరెడ్డి ఓ ప్రకటనలో విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలైన నాఫెడ్, ఉద్యానవన పరిశోధన అభివృద్ధి సంస్థలకు భూములను కేటాయించే విషయంలో రెవెన్యూ శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. నాఫెడ్‌కు భూమి కేటాయించే విషయంలో సీసీఎల్ఏ నుంచి రెవెన్యూ శాఖ వద్ద పెండింగ్‌లో ఉందని తెలిపారు. ఉద్యాన పరిశోధన అభివృద్ధి సంస్థకు జల వనరులు, ఆర్థిక శాఖ వద్ద పెండింగ్‌లో ఉందని వివరించారు. ఈ విషయంపై ఈ నెల 18న మైదుకూరుకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినతిపత్రం అందజేసినట్టు పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉండగానే నాఫెడ్‌కు ప్రతిపాదించిన భూమిపై జీఓ ఇచ్చారని తెలిపారు. అదే భూమిలో కాపు భవనాన్ని నిర్మించేందుకు మంగళవారం ఆర్డీఓ ఆ భూమిని పరిశీలించడం ఎంత వరకు సబబు అని ఆయన ప్రశ్నించారు. దీనిపై ముఖ్యమంత్రికి వినతి పత్రాన్ని పంపినట్లు తెలిపారు.

## మొండి పన్ను బకాయిదారులకు రెడ్ నోటీసులు



సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలో 324 మంది మొండి పన్ను బకాయిదారులకు రెడ్ నోటీసులు జారీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలో జరుగుతున్న పన్ను వసూలు కార్యక్రమాన్ని పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి, నీటి పన్నులు దీర్ఘ కాలికంగా పెండింగ్‌లో ఉన్న వారిని గుర్తించి ఇప్పటికే నోటీసులు అందజేశామని, అయినప్పటికీ స్పందించకపోవడంతో రెడ్ నోటీసులు జారీ చేయడం జరిగిందని తెలిపారు. 23 సచివాలయాల్లో పన్ను వసూళ్ల కొరకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆర్ఓ రఘునాథ రెడ్డి, మున్సిపల్ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

**మెరుగైన వైద్యసేవలు అందించాలి**

అర్బన్ హెల్త్‌సెంటర్‌లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి వైద్య సిబ్బందికి సూచించారు. బుధవారం గుంతపల్లె అర్బన్ హెల్త్ సెంటర్‌ను సందర్శించిన ఆయన సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. హెల్త్ సెంటర్‌కు వచ్చే రోగుల ఆరోగ్య వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. అలాగే హెల్త్ సెంటర్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం గుంతపల్లె, కుమ్మరికొట్టాలు, భావనారాయణనగర్, తొట్టిగారిపల్లె సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా సచివాలయాల్లో విధులకు సకాలంలో హాజరు కాని 8 మంది సెక్రటరీలకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు.

## లేగదూడల ప్రదర్శన



బ్రాహ్మణపల్లెలో నిర్వహించిన లేగదూడల ప్రదర్శన

కలసపాడు : మండలంలోని బ్రాహ్మణపల్లెలో బుధవారం రాష్ట్రీయ గోకుల్‌మిషన్, ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన లేగదూడల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని రాజుపాలెం సర్పంచ్ సూదా రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కడప డివిజన్ ఉప సంచాలకులు టి.వి.రమణయ్య, పోరుమామిళ్ల సహాయ సంచాలకులు కె.చంద్రశేఖర్‌లు మాట్లాడుతూ పశువులలో ఏడాదికి ఒక దూడ, దాని ప్రాముఖ్యత, మేలైన యాజమాన్య పద్ధతుల గురించి, అలాగే పశువులలో ఎద లక్షణాలు, వివిధ పథకాల గురించి వివరించారు. అలాగే లింగనిర్ధారిత వీర్యం ప్రాముఖ్యత, పెయ్యదూడల వీర్యం గురించి వివరించారు. 63 దూడలు ప్రదర్శనలో ఉంచారు. దూడలకు నట్టల నివారణ మందులతో పాటు చర్మ సంబంధిత వ్యాధులు రాకుండా టీకాలు, బలవర్ధకమైన టానిక్‌లు, మినరల్ బ్లాక్స్‌లను పాడిరైతులకు పంపిణీ చేశారు. లేగదూడల ప్రదర్శనలో మొదటి మూడు దూడలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను వాటి పాడిరైతులకు అందజేశారు. మిగిలిన రైతులందరికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు డాక్టర్ ఎ.వెంకటేశ్వర్‌రావు, డాక్టర్ శివరామిరెడ్డి, డాక్టర్ శరత్, గోపాలమిత్రలు, పశువైద్య సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

## 1న న్యూరో స్పైన్ కేర్ హాస్పిటల్ వార్షికోత్సవం



మాట్లాడుతున్న డాక్టర్ హరికిశోర్ రెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక సాయికుటీర్ రోడ్డులోని హరికిషోర్ న్యూరో, స్పైన్ అండ్ ఈఎన్‌టీ కేర్ ఆస్పత్రిలో ఫిబ్రవరి 1న 5వ వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు డాక్టర్ హరికిశోర్ తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 5 ఏళ్లుగా పట్టణంలో న్యూరో విభాగంలో తాను, ఈఎన్‌టీ విభాగంలో తన భార్య డాక్టర్ ఎస్.లక్ష్మీప్రసన్న వైద్య సేవలందిస్తున్నామన్నారు. తమ హాస్పిటల్ పట్టణంలో మొదటి న్యూరో సర్జరీ 24 గంటల హాస్పిటల్ అని, పక్షవాతం వచ్చి నాలుగున్నర గంటలలో వచ్చిన వారికి ప్రత్యేక చికిత్స, డిస్క్ సమస్యలు, మూర్ఛ, వెన్నుముక విరగడం, బ్రెయిన్ ట్యూమర్, వినికిడి సమస్యలు, చెవిలో శబ్దం రావడం, గొంతులో గడ్డలు, నోటి క్యాన్సర్, థైరాయిడ్ తదితర వాటికి అ త్యాధునిక పరికరాలతో వైద్య పరీక్షలు, చికిత్సలు చేస్తున్నామన్నారు. హైదరాబాదు, తిరుపతి, కర్నూలు, కడప తదితర ప్రాంతాల్లో లభించే వైద్య సేవలు తమ హాస్పిటల్‌లో అత్యాధునిక వైద్య పరికరాలతో అందిస్తున్నామన్నారు. హాస్పిటల్ 5వ వార్షికోత్సవం సందర్భంగా ఫిబ్రవరి 1న ఓపీ ఉచితంగా చూస్తామని, రక్తపరీక్షలు, ఎక్స్‌రేలపై 50 శాతం రాయితీ ఇస్తున్నామని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఫిబ్రవరి 1న షిరిడిసాయినాథ్ పంచమ వార్షికోత్సవం

గోపవరం : మండలంలోని టీ.సంద్రపల్లె పంచాయతీ బుచ్చనపల్లె గ్రామంలో కొలువైన శ్రీశ్రీషిరిడిసాయినాథ్ మహరాజ్ స్వామి వారి పంచమ వార్షికోత్సవం ఫిబ్రవరి 1వ తేదీ శనివారం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు కూకట్లపల్లివెంకమ్మ, నారాయణలు తెలిపారు. శనివారం ఉదయం 6 గంటల నుండి 6:30 గంటలలోపు కాకడహారతి, 7 నుంచి 7:30 గంటల వరకు బాబావారికి పంచామృతాభిషేకం, 9 గంటలకు కలశాభిషకం ఉంటుందన్నారు. 10 గంటలకు అభిషేకం, భక్తుల సర్వదర్శనం, మధ్యాహ్నం 12 నుంచి 12:30 గంటల వరకు మధ్యాహ్నహారతి ఉంటుందన్నారు. అనంతరం రాచాయపేట, వడ్డెఅగ్రహారం గ్రామాల్లో బాబావారి గ్రామోత్సవం ఉంటుందన్నారు. వచ్చిన భక్తులకు ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ఆయన కృపకు పాత్రులు కాగలరని వారు కోరారు.